క్లుప్తంగా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



ఘటనా స్థలంలో కారు

వెంకటాచలం: కారు బోల్తా పడి ఐదుగురు స్వల్పంగా గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కసుమూరులోని మస్తాన్వలీ దర్గాకు ఐదుగురు భక్తులు కారులో వచ్చారు. అనంతరం ఏఎస్‌పేటకు పాలిచెర్ల పాడు మీదుగా వెళుతుండగా, కసుమూరు మలుపురోడ్డు వద్ద కారు అదుపుతప్పి సాగునీటి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వారు స్వల్పంగా గాయపడ్డారు. అటుగా వెళ్లే ప్రయాణికులు వారిని కాలువలో నుంచి బయటకు తీశారు.

బైక్ అదుపుతప్పి..

మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. తిక్కవరప్పాడు వైపు నుంచి గొలగమూడికి వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. అతను గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



దీక్ష

వెంకటాచలం: రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు గొలగమూడి వద్ద నున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని దీక్ష ఎంపికైనట్లు పీడీ షేక్.షబిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా ధూళిపాళ్లలో ఈనెల 30, 31 తేదీల్లో జరిగే పోటీల్లో దీక్ష పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వీఎస్‌యూలో అంతరిక్ష దినోత్సవం



బహుమతి అందజేస్తున్న వీసీ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో అంతరిక్ష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి వీసీ అల్లం శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


విడవలూరు: మండలంలోని రామతీర్థం గ్రామ రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్సీ ఏడీఏ దేవసేన, మండల వ్యవసాయాధికారి లక్ష్మి మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీతో స్థానిక రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు వీఏఏలను సంప్రదించాలని కోరారు. అనంతరం స్థానిక వరి, వేరుశనగ రైతుల పొలాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

- **కోవూరు:** కోవూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ అనిత మాట్లాడుతూ ప్రస్తుతం కోవూరులో వరి కోతలు ప్రారంభమైనట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా 'ఈ–క్రాప్' నమోదు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది రామలక్ష్మితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కాకాణి పరామర్శ




వెంకటాచలం: మండలంలో పలువురు వైఎస్సార్‌సీపీ కుటుంబాలను మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. వెంకటాచలం వడ్డిపాళెంలో అనారోగ్యంతో బాధపడుతున్న తురకా శీనయ్యను, కసుపూరు సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, కసుమూరుకు చెందిన నాయకులు పఠాన్ హుస్సేన్‌ను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కసుమూరులో కార్యకర్త దేవళ్ల రమణయ్య తల్లి మృతిచెందగా ఆ కుటుంబాన్ని, యాక్సిడెంట్‌కు గురైన కార్యకర్త పాతపాటి కొండయ్యను పరామర్శించారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ కసుపూరు కోదండరామిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, సీనియర్ నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




పొదలకూరు : పద్మావతినగర్‌లో ఆదిశేషునిపై నాట్యం చేస్తున్న విఘ్నేశ్వరుడు



పొదలకూరు : రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడు



పొదలకూరు : రామనగర్‌గేటు సెంటర్‌లో..



పొదలకూరు : నర్సారెడ్డికాలనీలో..

గణనాథునికి ప్రణమిల్లి..



మనుబోలు: విద్యుద్దీపాల వెలుగులో..



టీపీగూడూరు : నిమజ్జనానికి కోడూరు తీరానికి తరలిస్తూ..



మనుబోలు: మట్టి ప్రతిమల పంపిణీ



వెంకటాచలం : ఉట్టి కొడుతున్న యువకులు

పొదలకూరు: వినాయకచవితి సందర్భంగా మండల కేంద్రమైన పొదలకూరులో బుధవారం విగ్రహాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పోటాపోటీగా ఉత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని రామమందిరం, తొగటివీధి, పద్మావతినగర్, వినాయకమాన్యం, పుట్టాయగుంట, యాదవవీధి, సంగంరోడ్డు సెంటర్, రామనగర్‌గేటు సెంటర్, శ్రీహరికాలనీ, శింగయ్యచేను, అగచాట్లపురం, విఘ్నేశ్వరపురం కాలనీ, శ్రీనివాసపురంవీధి, మస్తాన్‌రెడ్డి నగర్, మారుతీనగర్, నరసారెడ్డికాలనీ, బాలాజీనగర్, శివాలయం వీధి, సంగంరోడ్డు సెంటరు, నిమ్మమార్కెట్ యార్డు తదితర ప్రాంతాల్లో గణేషుని విగ్రహాలను పెట్టారు. రామనగర్ గేటు సెంటర్‌లో, పద్మావతినగర్, తొగటివీధి వీధుల్లో గురువారం భక్తులకు అన్నదానం చేశారు. విద్యుద్దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు పాట కచ్చేరిలు ఏర్పాటు చేశారు.

⇨ **వెంకటాచలం:** మండలంలోని వెంకటాచలం, సర్వేపల్లి, తిక్కవరప్పాడు, కసుమూరు, గొలగమూడి, కంటేపల్లి, కాకుటూరు, చెముడుగుంట తదితర గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉట్టి మహోత్సవాలను నిర్వహించారు.

⇨ **తోటపల్లిగూడూరు:** మండలంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 22 పంచాయతీలకు సంబంధించి సుమారు 120కి పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లోని విగ్రహాలను గురువారం నిమజ్జనాలకు కోడూరు, కాటేపల్లి తీరాలకు తరలించారు.

⇨ **మనుబోలు:** మండలంలోని అన్ని గ్రామాల్లో 100కు పైగా విగ్రహాలను నెలకొల్పారు. మనుబోలులోనే 20 పైగా విగ్రహాలను వివిధ కూడళ్లలో ఏర్పాటు చేశారు. మండపాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. మరో వారంరోజులపాటు నిమజ్జనాలు కొనసాగుతాయి.

⇨ శ్రీసేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో 400 మట్టి వినాయక ప్రతిమలను ట్రస్ట్ సభ్యులు గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులకు వర్క్‌షాపు నేడు

పొదలకూరు: మండలంలోని అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శుక్రవారం వర్క్‌షాపు నిర్వహిస్తామని ఎంపీడీఓ డీవీ నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇన్‌డెక్స్ (పీఏఐ 1.0), ట్రాన్స్‌సెషన్ టు పీఏఐ 2.0పై ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. దీనికి మండల స్థాయి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఏఎస్ఓ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, ఎంపీపీ, సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలన్నారు. రెండో బ్యాచ్ కింద 50 మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మండలంలోని కాగితాలపూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మీర్ మహమ్మద్ రజా (50) గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మహమ్మద్ రజా బుధవారం రాత్రి పని ముగించుకుని ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బొలేరో వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం మొదట గూడూరుకు ఆపై నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు ప్రమాదానికి కారణమైన బొలేరో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపుపై కేసు నమోదు

పొదలకూరు: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు నుంచి సంగంకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న డ్రైవర్ ప్రసాద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు వివరాలు.. గురువారం రాత్రి మండలంలోని బిరదవోలు మీదుగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా వినాయక చవితి ఉత్సవాలు చేసుకుంటున్న యువకులు దానిని నిలిపారు. ఈ క్రమంలో వివాదం చోటుచేసుకుంది. యువకులు వ్యర్థాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వ్యర్థాలను సంగం మండలంలోని చేపల చెరువుల వద్దకు తరలిస్తున్నట్టు డ్రైవర్ పోలీసులకు వెల్లడించాడు.

గోవర్ధన్‌రెడ్డిని కలిసిన నాయకులు



ప్రత్యేక పూజలు నిర్వహించిన కాకాణి, చిత్రంలో నేతలు

పొదలకూరు: మండలంలోని బిరదవోలు పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు శాలువాలు, పూలమాలలు వేసి అభినందించారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల నుంచి కడిగిన ముత్యంలా కాకాణి బయటపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో..

మండలంలోని మొగళ్లూరు గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకాణి జైలు నుంచి విడుదలైన తర్వాత మొదటిసారిగా గ్రామానికి విచ్చేయడంతో పెద్దఎత్తున యువకులు స్వాగతం పలికారు. అంతకుముందు గ్రామ మాజీ సర్పంచ్ యాతం పెంచలరెడ్డి కాకాణికి శాలువా కప్పి సన్మానించారు. గ్రామంలో ఇటీవల మృతిచెందిన భజన గురువు చెన్నూరు సుబ్బరాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యానికి గురైన పార్టీ నాయకుడు యనలమల రమణారెడ్డి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, గ్రామ నాయకులు పలుకూరు పెంచలనారాయణరెడ్డి, అంకిరెడ్డి, యనమల శ్రీనివాసులురెడ్డి, ఆకుల చినగంగిరెడ్డి తదితరులు ఉన్నారు.



- బీజేపీ మహిళా నాయకురాలి భూమిలో టేకు చెట్ల నరికివేత
- ఎమ్మెల్యే సోమిరెడ్డి వద్ద పంచాయితీ
- పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నాయకురాలు
- ఆమెకు బీజేపీ, జనసేన, బలిజ సంఘాల నాయకుల బాసట

టీడీపీ నేతల ఇష్టారాజ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పార్టీలను లెక్క చేయడం లేదు. వారు.. వీరని తేడా లేకుండా దాష్టీకాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు. ముఖ్య నాయకుల పేర్లు చెప్పుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టించడం లేదా పోలీసుల ద్వారా బెదిరింపులకు పాల్పడటం రివాజుగా మారింది. నెల్లూరు నగరానికి చెందిన బీజేపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కె.రాజేశ్వరి సొంత భూమిలో టీడీపీ నాయకులు టేకు చెట్లను అక్రమంగా నరికి దుంగలను తరలించారు. ఈ వ్యవహారం కలకలం రేపింది. ఆమె రాతపూర్వంగా మంగళవారం పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు.

వంద టేకు చెట్ల నరికివేత

పొదలకూరు మండలం మరుపూరు గ్రామంలో రాజేశ్వరికి 637 – 3, 637 – 4, 639 – 1, 639 – 2, 640 – 1, 640 – 2 సర్వే నంబర్లలో 20.98 ఎకరాల భూమి ఉంది. ఇక్కడున్న వంద టేకు చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసినట్టు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే రూ.లక్షల విలువైన చెట్లను నరికింది టీడీపీకి చెందిన వారిగా గుర్తించారు. రాజేశ్వరి ఈ విషయాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. అయితే ఆయన నంద్యాల ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నానని పంచాయితీ పెట్టేందుకు సమయం కావాలని కాలయాపన చేస్తున్నట్టు తెలిసింది. దీంతో కొద్దిరోజులు చూసిన రాజేశ్వరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ – మెయిల్ ద్వారా ఫిర్యాదు

మూడు దశాబ్దాలుగా మరుపూరు రెవెన్యూ విలేజ్‌లో పొలం ఉన్న రాజేశ్వరికి జరిగిన అన్యాయానికి పలువురు బాసటగా నిలుస్తున్నారు. సొంత పార్టీతో పాటు, జనసేన, శ్రీపుట్టపర్తి సాయిబాబా సేవాసదన్, పల్లెపాటు గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు, బలిజ సేవా సంఘం నాయకులు సంఘీభావం తెలిపి సోషల్ మీడియా వేదికగా ఘటనను ఖండిస్తున్నారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బాధితురాలు బీజేపీ, జనసేన రాష్ట్ర అధిష్టానానికి ఈ – మెయిల్ ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.



పొలంలో టేకు దుంగలు



టేకు చెట్లను నరికివేసిన దృశ్యం

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఇస్కపాళెంలో గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు భారంగా మారుతాయన్నారు. అదానీ సంస్థకు వందల కోట్ల రూపాయలు ఆదాయం సమకూర్చే మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని వెంటనే ఆపాలన్నారు. అలాగే సర్‌చార్జీలు, ట్రు అప్ చార్జీల పేరుతో పెంచిన కరెంట్ బిల్లులను వెంటనే తగ్గించాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో నేతలు బండి శౌరి, మారుబోయిన రాజా, పచ్చా మధు, ఇనమాల కొండయ్య, మోచర్ల రాధయ్య, జనార్దన్, వీరయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు సరికాదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విద్యుత్ చార్జీల పెంపు సరికాదని సీపీఎం నాయకులు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయం నుంచి బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం విద్యుత్ చార్జీల పెంపుపై బషీర్‌బాగ్‌లో నిరసన వ్యక్తం చేసినప్పుడు ఆ సమయంలో సీఎంగా చంద్రబాబు ఫైరింగ్ చేయించడంతో సీపీఎం కార్యకర్తలు ముగ్గురు చనిపోయారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు విరమించి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు.

రైతులను ఆదుకోవాలి

గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందజేశారు. రైతులకు మద్దతు ధర కల్పించకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు.

ఫిట్‌నెస్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఇందుకూరుపేట: నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఫిట్‌నెస్ ప్రాధాన్యతపై ఇందుకూరుపేట మండలం కొత్తూరులోని జెడ్పీ హెచ్ఎస్ ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'ప్రతిఒక్కరూ రోజులో కనీసం అరగంట వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవించవచ్చన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

పొదలకూరు: ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారిన పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ఆక్రమణలను తొలగించాలని స్థానిక బీజేపీ నాయకులు చింతగింజల చినసుబ్రహ్మణ్యం, దాసరి సురేంద్రబాబు తదితరులు గురువారం ఎంపీడీఓ డీవీ నరసింహారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్‌లో దుకాణదారులు రోజురోజుకు ముందుకొచ్చి బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్టు తెలిపారు. దగ్గరలోని ఆర్టీసీ బస్టాండ్‌లో షాపులు నిర్మిస్తున్నారని, అక్కడ వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ను కూడా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఎంపీడీఓ వినతిపత్రాన్ని పరిశీలించి పంచాయతీ సెక్రటరీకు అందజేసి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 11 కేవీ ఫీడర్ బ్రేకర్ పనుల కోసం మత్తుకూరు, మల్లూరు, పీవీ కండ్రిక, మామిడిపూడి, చలివేంద్రం, బలిజపాళెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అక్బర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో కొన్ని గంటలు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. బ్రేకర్స్ ఏర్పాటు తర్వాత నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

'ఫ్యామిలీ డాక్టర్'కు అపూర్వ స్పందన



పెయ్యలపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి హాజరైన వైద్య బృందం

కొడవలూరు: గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పెయ్యలపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులు వైద్యసేవల కోసం ఎంతో దూరం వెళ్లకుండా ఇంటి వద్దకే వైద్యులు వచ్చే బృహోత్తర కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ అని తెలిపారు. దీని ద్వారా గ్రామాల్లో వైద్య సేవల ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రంలో 4,472 విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏ ఒ.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ రేష్మా, ఏఎన్‌ఎంలు పెంచలమ్మ, షీలా, ఆశా కార్యకర్త మల్లీశ్వరి పాల్గొన్నారు.

హామీలెప్పుడు అమలు చేస్తారు?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీశారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బాబు హామీలన్నీ బూటకమేనని తెలిపారు. తల్లికి వందనం సగం మందికి మాత్రమే ఇచ్చారని, మిగతావారికి అనేక కారణాలు చూపుతూ ఇవ్వలేదన్నారు. ఎన్నికలకు ముందు ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం ఇస్తామని చెప్పి ప్రస్తుతం మోసపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. తాజాగా దివ్యాంగులపై కనికరం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా పింఛన్లు తొలగిస్తూ నోటీసులు జారీ చేయడం క్రూరత్వమని, సీఎం చంద్రబాబుకు దివ్యాంగులపై ఎంత ప్రేముందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి గురించి అసలు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా ఒక్క హామీ కూడా సంపూర్ణంగా నెరవేర్చకపోవడం కూటమి ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఇకనైనా హామీలు అమలు చేయకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, షేక్ షాహుల్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.